క్లుప్తంగా

8న భీమదేవర జెండా పండుగ


జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

కౌటాల: ఆదివాసీల ఆత్మగౌరవ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 8న భీమదేవర జెండా పండుగ నిర్వహించనున్నట్లు కొలవార్ సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు ఆత్రం సత్తయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కొలవార్ సంక్షేమ సంఘం భవనం ఆవరణంలో భీమదేవర జెండాను ఆవిష్కరించారు. ఆదివాసీ కొలవార్ (మన్నేవార్) ప్రజలు సంస్కృతి, సంప్రదాయాలను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు డబ్బా గోపాల్, నాయకులు కుర్మ రాజు, అశోక్, హన్మంతు, సత్తయ్య, రవి, సురేశ్, నగేశ్, చిలుకయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి


పోటీలు ప్రారంభిస్తున్న గ్రామస్తులు

లింగాపూర్: గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని గ్రామ నాయక్ కిరణ్ అన్నారు. సోమవారం శ్రీ జగదంబా దేవి జాతర సందర్భంగా వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. ప్రతిఒక్కరూ చదువుతో పాటు క్రీడల్లో సత్తా చాటాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కవిందర్, హిరణ్, జాదు, బాలు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

బెజ్జూర్: ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ (ఆటా) నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండల విద్యాధికారి సునీత ఆవిష్కరించారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తలండి లక్ష్మణ్ మాట్లాడుతూ జీవో 3 చట్టం చేయాలన్నారు. ప్రభుత్వం ఎస్ఎస్ఏ కాంట్రాక్ట్ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించి వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి చింటపూరి రాజారాం, సోమిని ప్రధానోపాధ్యాయుడు బిక్షమయ్య, రమేశ్, రాములు, హన్నత్, పరదేశి పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు


ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ శేశరావ్

ఆసిఫాబాద్అర్బన్: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ ఎస్సీ కాలనీలో 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఆర్. శేశరావ్ తెలిపారు. విద్యుత్ లైన్ మరమ్మతులు, నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎక్కడైనా విద్యుత్ సరఫరాలో సమస్యలు ఉంటే విద్యుత్ శాఖ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డివిజనల్ ఇంజినీర్ జీవరత్నం, ఏడీఈ ఫిరోజ్, ఏఈ లక్ష్మిరాజ్యం, ఫోర్‌మెన్ రమేశ్, లైన్‌మెన్‌లు శ్రావణ్, గోపాల్, శంకరయ్య, లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి తరలిన నాయకులు

కాగజ్‌నగర్ రూరల్: ఆదిలాబాద్ నిర్వహించిన కాంగ్రెస్ సమావేశానికి సోమవారం ఎమ్మెల్సీ దండె విఠల్ ఆధ్వర్యంలో సిర్పూర్ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. బయలుదేరిన వారిలో మాజీ జెడ్పీ చైర్మన్ సిడాం గణపతి, టీపీసీసీ సభ్యులు జగ్గాగౌడ్, మాజీ జెడ్పీటీసీ నానయ్య, మున్నూరు కాపు సంఘం నాయకులు కలికోట రమణయ్య, తదితరులు ఉన్నారు.

బంగారం, నగదు చోరీ

కాగజ్‌నగర్ రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలోని బస్టాండ్‌లో సోమవారం చోరీ జరిగింది. పట్టణంలోని పోచమ్మబస్తీకి చెందిన రమాదేవి అనే మహిళ గోదావరిఖనికి వెళ్లేందుకు మంచిర్యాలకు బస్టాండ్‌కు చేరుకుంది. రద్దీగా ఉన్న బస్సు ఎక్కే క్రమంలో మహిళ బ్యాగును గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారు. సదరు మహిళ బ్యాగులో రెండు తులాల బంగారు ఆభరణాలు, రెండు వేల రూపాయలు ఉన్నాయని సదరు మహిళ పేర్కొంది. ఈ విషయమై పట్టణ పోలీసులను సంప్రదించగా, తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

గ్రామానికో నర్సరీ..!

- 335 జీపీల్లో ఊపందుకున్న పనులు
- జిల్లాకు 4.65 లక్షల మొక్కల పెంపే లక్ష్యం


మట్టిని బ్యాగుల్లో నింపుతున్న కూలీలు

ఆసిఫాబాద్‌రూరల్: ఊరూరా పచ్చదనం కనిపించేలా పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా జూన్‌లో వనమహోత్సవం నిర్వహిస్తోంది. పచ్చదనం పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటేందుకు ప్రతీ గ్రామ పంచాయతీలో నర్సరీలు ఏర్పాటు చేసింది. మొక్కలు నాటేందుకు ఇప్పటి నుంచే ప్రతీ గ్రామ పంచాయతీలో నర్సరీలు సిద్ధం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 335 గ్రామ పంచాయతీల్లో 12 వేల నుంచి లక్ష మొక్కలను సిద్ధం చేసేందుకు బ్యాగుల్లో మట్టిని నింపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 4.65 లక్షల మొక్కలను 335 గ్రామ పంచాయతీల్లో సిద్ధం చేస్తున్నారు.

ఊపందుకున్న పనులు..

జిల్లాలోని 335 గ్రామ పంచాయతీల్లో నర్సరీ పనులు ఊపందుకున్నాయి. నర్సరీలు ఏర్పాటు చేసే స్థలాల వద్ద మట్టి కుప్పలు పోయించి ఉపాధి కూలీలతో ప్లాస్టిక్ సంచుల్లో మట్టిని నింపే ప్రక్రియ పూర్తి చేస్తున్నారు. వాటిని సంరక్షించేలా ఆయా శాఖల అధికారులు భాగస్వామ్యం కీలకంగా మారింది. మండల ప్రత్యేకాధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, ఉపాధి హామీ ఏపీవోలు, సిబ్బంది నిత్యం నర్సరీలను పర్యవేక్షిస్తున్నారు. విత్తనాలు ఉన్న సంచుల్లో నీటిని చల్లించడంతో పాటు పిచ్చి మొక్కలను తొలగించే పనులు చేయిస్తున్నారు.

జీపీలా వారీగా ఇలా..

కుమురం భీం జిల్లాలోని 15 మండలాల్లో గల 335జీపీల్లో ఒక్కో జీపీకి 12,100 మొక్కలతో మొత్తంగా 4,05,600 మొక్కలను పెంచేందుకు సిద్ధం చేస్తున్నారు. ఆసిఫాబాద్ మండలంలో చిలాటిగూడ 12100, కౌటగూడ 12100, గవిండ్‌పూర్ 1,25,000, మాలన్‌గొంది 12100, సాలేగూడ, అంకుసాపూర్, చిర్రకుంట, మోవాడ్, రహపల్లి, ఇదులవాడ, వెంకటపూర్, ఆడ, తుంపెల్లి, అడదస్నాపూర్, గుండి, బాబాపూర్, కోసారా, మోతుగూడ, బూర్గుడ, అప్పపల్లితో పాటు మిగతా గ్రామ పంచాయతీల్లో 12,100 మొక్కలను పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మొక్కల సంరక్షణ అంతంతే..

నర్సరీల్లో మొక్కలు పెంచి జూన్, జూలై నెలల్లో ఏటా మొక్కలు పెంచుతున్నారు. కానీ నాటిన మొక్కల సంరక్షణ అంతంత మాత్రంగానే ఉండటంతో మొక్కల రక్షణ లేక కోట్ల రూపాయలు వృథా అవుతున్నాయి. ఒక్కో మొక్కకు చేస్తున్న ఖర్చు మాత్రం ఎక్కువగా ఉంది. నర్సరీలో ఒక్కో మొక్కకు రూ.108లు ఖర్చవుతుంది. గుంత తీయడానికి రూ.27, నర్సరీ నుంచి పల్లె ప్రకృతి వనానికి రవాణా ఖర్చు రూ.1.14 (ఒక మొక్క), నాటడానికి రూ.16 వెచ్చిస్తున్నారు. ఒక్కో మొక్కకు నీళ్లు పట్టడానికి రూ.1.80 నిర్వహణ ఖర్చు చేస్తున్నారు. ఈ విధంగా ఒక్కో మొక్కకు రూ. 80.94 వ్యయమవుతుంది. కాని వేలాదిగా నాటిన మొక్కలను ఎవరు లెక్కిస్తారనే దీమాతో అధికారులు పచ్చదనం మాటున లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. కానీ నాటిన మొక్కలను సంరక్షించలేక పోతున్నారు. పల్లె ప్రకృతి వనం మినహాయించి రోడ్డుకిరువైపులా నాటిన మొక్కలు కనిపించడం లేదు.

వైభవంగా అయ్యప్ప ఇరుముడి


శబరిమల వెళ్తున్న అయ్యప్ప స్వాములు

బెజ్జూర్: ఇరుముడి కార్యక్రమం మండల కేంద్రంలోని శ్రీ రంగనాయక ఆలయ ప్రాంగణంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన భిక్షపతి గురుస్వామి ఆధ్వర్యంలో బెజ్జూర్ మండలంలో 41 రోజుల పాటు దీక్ష పూర్తి చేసుకొని శబరిమలై యాత్రకు బయలుదేరిన అయ్యప్ప స్వాములకు ఇరుముడి కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి బెజ్జూర్ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో నలుమూలల నుంచి అయ్యప్ప భక్తులు భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో గురుస్వాములు జిల్లాల సుధాకర్ గౌడ్, భీంరావు, సంతోష్, దిగంబర్, నిలేశ్, రాజన్న, రవని, నవీన్, సురేశ్ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి


మాట్లాడుతున్న ఆంజనేయులుగౌడ్

రెబ్బెన: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులు గౌడ్ అన్నారు. సోమవారం రెబ్బెనలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రైతు భరోసా పథకం కింద ఎకరానికి రూ.15వేలు అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు మాట మార్చి కేవలం రూ.12వేలు మాత్రమే చెల్లిస్తామని ప్రకటించటం దుర్మార్గమన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి కాగా రైతుభరోసాను ఎగొట్టిందన్నారు. అన్నిరకాల వడ్లకు రూ. 500 బోనస్ చెల్లిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక కేవలం సన్నరకం ధాన్యానికి బోనస్‌ను పరిమితం చేశారని మండిపడ్డారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి కుందారపు బాలక్రిష్ణ, నవీన్ గౌడ్ పాల్గొన్నారు.

'కార్మికుల సమస్యలు గాలికి'


మాట్లాడుతున్న రియాజ్ హైమద్

రెబ్బెన: కార్మికులు నమ్మకంతో ఏఐటీయూసీకి గుర్తింపు హోదా కల్పిస్తే ఆ సంఘం నాయకులు కార్మిక సమస్యలను గాలికి వదిలేసి పైరవీలకే పరిమితం అయ్యారని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ హైమద్ ఆరోపించారు. సోమవారం బెల్లంపల్లి ఏరియాలోని కై రిగూడ ఓసీపీలో కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు డ్యూటీకి వెళ్లేందుకు సరిపడా బస్సులు లేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఏ గ్రేడ్ వాహనాలు నడుపుతున్న ఈపీ ఆపరేటర్లందరికి ప్రమోషన్లు ఇవ్వకపోవటంతో కార్మికులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఓసీపీలో ఓవర్‌మెన్స్ టెక్నిషియన్స్, జనరల్ మజ్దూర్‌ల కొరత తీవ్రంగా ఉందని అన్నారు. సరిపడా మ్యాన్ పవర్ కోసం ప్రశ్నించాల్సిన గుర్తింపు సంఘం నాయకులు ఉచిత మాస్టర్లకు అలవాటు పడి కార్మిక సమస్యలను పట్టించుకోవటం లేదన్నారు. సమావేశంలో ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఓజియార్, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు సారయ్య, మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ఏరియా ఆర్గనైజర్ ఎస్‌కే ఇనూస్, దత్తులు పాల్గొన్నారు.

'పది'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి


అల్పాహారం పంపిణీ చేస్తున్న నాయకులు


అల్పాహారం అందజేస్తున్న నాయకులు

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కౌటాల మాజీ ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. సోమవారం కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ దండె విఠల్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు ఆకలితో అలమటించకుండా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఉదయం అల్పాహారం, సాయంత్రం స్నాక్స్‌ను ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో గావుడే హన్మంతు, హెచ్‌ఎం నారాయణ్‌సింగ్, పసునూరి తిరుపతి, అజ్మత్, గట్టయ్య, రవీందర్‌గౌడ్, ఏమాజీ, రవి, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ రూరల్: పదో తరగతి విద్యార్థుల వంద శాతం ఉత్తీర్ణత సాధించాలనే ఉద్దేశంతో సోమవారం నుంచి పలు పాఠశాలల్లో ఎమ్మెల్సీ దండె విఠల్ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ చేశారు. మండలంలోని భట్‌పల్లి, చింతగూడ, పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ (పెట్రోల్‌పంపు) పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రభాకర్, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

బెజ్జూర్: ఎమ్మెల్సీ దండే విఠల్ హామీ మేరకు పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించడం జరుగుతుందని బెజ్జూర్ మాజీ సర్పంచ్ పెద్దల సుగుణ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలతో పాటు ఉట్ సారంగపల్లి గ్రామంలోని పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు నాయిని భాగ్య, సామల రాజన్న, రంగు సురేశ్‌గౌడ్, జంగిటి మల్లేష్, పెద్దల శంకర్, సల్మాన్ ఖాన్, ఇగురపు వెంకటేశ్, మెరుగు రమేశ్ పాల్గొన్నారు.

పది విద్యార్థులకు అల్పాహారం

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని పెంచికల్‌పేట్, చేడ్వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఎమ్మెల్సీ దండె విఠల్ సహకారంతో అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతీ రోజు ఉద యం, సాయంత్రం వేళల్లో విద్యార్థులకు అ ల్పాహారం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో రమేశ్‌బాబు, హెచ్‌ఎం యాదగిరి, మాజీ సర్పంచ్ దాసరి చంద్రమౌళి, రాచకొండ కృష్ణ, సముద్రాల రాజన్న, శంకర్ గౌడ్, రాజు, ఇలియాస్, చందు పాల్గొన్నారు.

'గ్రామపంచాయతీని విడదీయవద్దు'


మాట్లాడుతున్న గ్రామస్తులు

ఆసిఫాబాద్అర్బన్: కౌటాల గ్రామపంచాయతీని రెండు జీపీలుగా విడదీయవద్దని గ్రామస్తులు సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. కౌటాల పరిధిలోని సదాశివపేట్, శివలింగాపూర్, నదిమాబాద్ గ్రామస్తులు ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు చెందినవారని, గ్రామ పంచాయతీని రెండు జీపీలుగా విభజించి శివలింగాపూర్‌ను గ్రామ పంచాయతీగా చేయాలని, అందులో సదాశివపేట్, నదిమాబాద్, శివలింగాపూర్‌లను కలిపి ఒక గ్రామపంచాయతీగా చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. దీంతో ప్రజలు చాలా నష్టపోతారని, కౌటాల జీపీని ఒకే గ్రామపంచాయతీగా ఉండేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు రాజయ్య, రమేశ్, సురేశ్, పోషన్న, నగేశ్, శ్యాంరావ్, లచ్చన్న, తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన సభ్యులు

ఆసిఫాబాద్: పద్మశాలి మహిళా సేవా సంఘం ఆసిఫాబాద్ పట్టణ నూతన కార్యవర్గాన్ని సోమవారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా జంజిరాల పుష్పలత, ప్రధాన కార్యదర్శిగా చెన్నూరి సునీతలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ఇరుకుల్ల ఆంజనేయులు, కనకయ్య, రాజన్న, లింగయ్య, అనుమాండ్ల శ్రీకాంత్, అల్లె శ్రీకాంత్, సంజీవ్‌కుమార్, అవిడపు ప్రణయ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కు పంపిణీ చేస్తున్న నాయకులు

కౌటాల: మండలంలోని ముత్తంపేట గ్రామానికి చెందిన తోగం నిర్మల అనే లబ్ధిదారులకు సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కును బీజేపీ నా యకులు అందజేశారు. ఆపదలో ఉన్నవారిని ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, నాయకులు భూమయ్య, తిరుపతి, శ్రీనివాస్, అంజన్న, పోషన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు ఘన స్వాగతం

కెరమెరి: ఎమ్మెల్సీ కల్వకుంట కవితకు కెరమెరి బీఆర్ఎస్ నాయకులు మండలంలోని కెస్లాగూడ గ్రామం వద్ద ఘన స్వాగతం పలికారు. మహిళలు మంగళ హారతులిచ్చి, నుదుట తిలకం దిద్దారు. అనంతరం శాలువాతో సన్మానించారు. జై తెలంగాణ అంటూ నినాదించారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ జెడ్పీటీసీ దుర్పతబాయి, మాజీ ఎంపీపీ పెందోర్ మోతిరాం, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీటీడీవో

కెరమెరి: మండలంలోని ఇందాపూర్ సమీపంలో ఉన్న పోతురాజ్, ధర్మరాజ్ ఉత్సవాల పోస్టర్‌ను సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా, ఆసిఫాబాద్ డీటీడీవో రమాదేవి ఆవిష్కరించారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో జరిగే ఉత్సవాలకు కమిటీ సభ్యులు వారిని ఆహ్వానించారు. ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ ఉత్సవాలను నిర్వహిస్తామని, కోరిన కోర్కెలు తీర్చే దేవుడిగా ప్రసిద్ధి అని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పెందోర్ మోతిరాం, సిడాం గంగు, సిడాం రాజు, సిడాం ధర్మూ, సిడాం భీము, సిడాం చిన్న భీము పాల్గొన్నారు.

అధ్యక్ష పదవికి నామినేషన్

ఆసిఫాబాద్అర్బన్: త్వరలో జరుగనున్న రాష్ట్ర మాలీ సంక్షేమ సంఘం ఎన్నికల్లో అధ్యక్ష పదవి కోసం జిల్లాకు చెందిన నికోడె రవీందర్ సోమవారం జిల్లా కేంద్రంలో సంఘం ఎన్నికల సభ్యులు దత్తుకు నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర సంఘం ఎన్నికలు ప్రతీ మూడు సంవత్సరాలకోసారి జరుగుతాయని, ఈనెల 12న నిర్వహించేన అధ్యక్ష పదవి పోటీలో ఉన్నట్లు తెలిపారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

సిర్పూర్(టి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సోమవారం సిర్పూర్(టి) ఎస్సై కమలాకర్ రోడ్డు నిబంధనలు, పాటించాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో విద్యార్థులతో మాట్లాడి రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ట్రాఫిక్ రూల్స్ గురించి వివరించారు. తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

సర్వే వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న డీఎల్‌పీవో ఉమర్ హుస్సేన్

సిర్పూర్(టి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలని డీఎల్‌పీవో ఉమర్ హుస్సేన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. మండలంలోని గ్రామాల్లో ప్రతిఒక్కరి దరఖాస్తులను పరిశీలించి ఇందిరమ్మ ఇళ్ల సర్వేను రెండు రోజుల్లోగా పూర్తిచేయాలన్నారు. అదే విధంగా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఇంటి ట్యాక్స్‌లు వసూలు చేయాలని, పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించవద్దన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె


సమ్మె చేస్తున్న ఉద్యోగులు

ఆసిఫాబాద్‌రూరల్: తమ న్యాయమైన డిమాండ్‌లను నెరవేర్చాలని జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మె సోమవారం 28వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షురాలు శృతిక మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను గుర్తించి తమ సమస్యలను పరిష్కరించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం అందించాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా సిబ్బంది తుకారాం, మోహన్, నగేశ్, సంతోష్, రాజేశ్, ప్రశాంత్, మల్లేష్, రమాదేవి, ధర్మయ్య, ఆనందర్ రావు, లత, లక్ష్మి, రాజు, రవీందర్, సోను పాల్గొన్నారు.

బారులుతీరిన పత్తి వాహనాలు


రోడ్డు పై నిలిపిన పత్తి వాహనాలు

కౌటాల: కౌటాల– మొగడ్‌దగడ్ రోడ్డు సమీపంలోని వైష్ణవి మాత జిన్నింగ్ మిల్లులో సోమవారం సీసీఐలో పత్తి విక్రయించేందుకు ఆయా గ్రామాల నుంచి భారీగా పత్తి వాహనాలు రావడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వారం రోజుల బంద్ అనంతరం పత్తి కొనుగోళ్ల ప్రారంభం కావడంతో వందలాది పత్తి వాహనాలతో జిన్నింగ్ మిల్లు నుంచి పెట్రోల్ పంపు వరకు బారులు తీరాయి. అలాగే కౌటాల వారసంత కావడంతో మండలంలోని మొగడ్‌దగడ్, వీర్దండి, తాటినగర్, భాలేపల్లి, గుండాయిపేట, తుమ్మిడిహెట్టి గ్రామాల నుంచి వారసంతకు వచ్చే ప్రజలు ఇబ్బంది పడ్డారు. రోడ్డు మీదనే పత్తి లోడ్ వాహనాలను నిలిపివేయడంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చిన సందర్భంలో వాహనదారులకు తిప్పలు తప్పలేదు. రైతులు రోజుల తరబడి మిల్లు వద్ద పడిగాపులు కాస్తున్నారు. పోలీసులు, సంబంధిత అధికారులు స్పందించి ట్రాఫిక్‌కు అంతరాయం కాకుండా చూడాలన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ఆసిఫాబాద్: కెరమెరి మండలం ఇందాపూర్‌లోని శ్రీపోతురాజు ధర్మరాజుల దేవస్థానం జాతర పోస్టర్‌ను సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో వెంకటేశ్ దోత్రే ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ నెల 15 నుంచి 17 వరకు నిర్వహించే పోతురాజు ధర్మరాజుల జాతర మహోత్సవం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, కమిటీ ప్రతినిధులు సిడాం రాజు, సిడాం ధర్మూ, దేవ్‌రావు, ఆత్రం రాము పాల్గొన్నారు.